

# కరిగిన కలలు విరిగిన అలలు

ఎస్. శ్యామల

ఎక్కడో దూరాన, మందంగా అందంగా వెంకటేశ్వర సుప్రభాతమ్ వినవస్తూంది.

ఆ యింటి యజమాని రామస్వామిగారు పూజలో వున్నారు. భార్య రాజమ్మ తెల్లవారేసరికల్లా గృహకృత్యాలు ముగించుకొని, పెరట్లో కాకర తీగలను పందిరికి పాకించే పనిలో వుంది. కొడుకు మూర్తి తెల్లవారకముందే తల్లి యిచ్చిన కాఫీ తాగి పొలం పనికి వెళ్ళిపోయాడు. 9 గం॥ అవుతున్నా యింకా ఆ యింట్లో తెల్లవారకుండా వుంది వారి అల్లారు ముద్దుల కూతురు ఉమాకు మాత్రమే.

పద్మాలుగేళ్ళు పైబడుతున్నా యింకా కోడికూత గానీ, సూర్యోదయాన్నిగానీ ఎరగదు ... యిప్పటికే రాజమ్మ కూతురు లేచిందేమోనని రెండు మూడు సార్లు వచ్చి చూసి వెళ్ళింది. ఆమె కిలాంటివన్నీ గిట్టవు. అందులో ఆడపిల్ల యిలా అయితే పెళ్ళి అయి పరాయింటికి వెళ్ళితే ఎన్ని బాధలు పడ వలసి వస్తుందోనని భయం. అట్లా అని కూతురిని మం

లింపటానికి వీలులేదు. ఆమె తండ్రికి గారాల పట్టి ..

తండ్రి పూజ ముగించి బయటకు రాబోయే సమయానికి "అమ్మా కాఫీ" అన్న కూతురు కేక వినిపించింది. అది వినటమే "రాజీ అమ్మాయికి కాఫీ" అంటూ భార్యని ఒక కేక పెట్టి, గదిలోకి వెళ్ళాడు రామస్వామి.

ఉమ కళ్ళు నులుముకుంటూ, ముసుగు తొలగించి నిద్ర లేస్తూనే తండ్రిని గారాముగా చూచింది.

"ఏమ్మా యింకా నిద్రపోతున్నావా? గంట తొమ్మిది. స్కూలుకు వేళ అయింది" అంటూ దగ్గరికి పోయాడు.

"తొమ్మిదైందా?" అంటూ గబగబా బయటికి వెళ్ళింది. మరో అరగంటలో స్నాన పానాదులన్నీ ముగించి హడావిడిగా బడికి బయలుదేరింది...

"కాస్త పెందరాళే లేస్తే ఈ తొందర వుండేది కాదుగా" అని మెత్తగా మందలించింది తల్లి ... దానికి జవాబుగా మల్లెపూవుల వంటి నవ్వులు కురిపిస్తూ వెళ్ళిపోయింది ఉమ.

ఉమకు 14 ఏండ్ల వయసు ... అందమయిన శరీరం ... ఆకర్షించే కళ్ళు, కఠిన శిలనయినా కరిగించే నవ్వులు ... దారులు వెతికే తీగలాగ, పలికే వీణలాగ, వుంది...

నిజానికి ఆ కుటుంబం ఆనందానికి నిలయం. కష్టాన్ని సుఖాన్ని ఒకే భావంతో అనుభవించే, రామస్వామికి-యిల్లే దేవాలయంగా, కుటుంబమే దైవంగా, తానే పూజారిగా. ఎంచుకొనే రాజమ్మ భార్య అయింది...

సంతానం యిద్దరే అయినా చక్కటి అందచందాలూ గుణగణాలుగల బిడ్డలు. అన్న చెల్లెళ్ళ అనురాగానికి అంతేలేదు...బిడ్డలను యిద్దరినీ పెద్ద చదువులు చదివించాలని రామస్వామి కన్న కలలు కొడుకు విషయంలో ఫలించలేదు. మూర్తికి చిన్నప్పటినుండీ. ఎడ్లూ బండ్లూ, పొలమూ వ్యవసాయమూ మీదనే ప్రీతి, చదువు మీద ఆసక్తి తక్కువ కావటంచేత. అతనిని వ్యవసాయంలోనే వదిలాడు. ఆశలన్నీ కూతురు మీదనే పెట్టుకుని చదివిస్తూ వున్నాడు. ఆ వూళ్ళో క్రొత్తగా హైస్కూలు పెట్టారు. ఆ స్కూల్లో ఏటేటా ఒక్కొక్క ఫారం పెడుతుంటే. ఉమ కూడా ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ, ఫిఫ్తు ఫారంలోకి వచ్చింది"

మరోఏటి కల్లా ఉమకు అవూరి చదువు అయిపోయింది. "ఇక పట్నం పంపించి కాలేజీలో చదివించే ప్రయత్నంలో వున్నాడు రామస్వామి.

రాజమ్మకు అది ఇష్టంలేదు. కూతురు పెద్దదయింది పెళ్ళి వయస్సు వచ్చింది. ఇంతవరకు యింటిపనులేమీ ఎరుగదు. ఆడపిల్లకి యికముందు సంసారం చక్కదిద్దుకోవటం కావాలిగానీ, ఈ చదువులెందుకు?

అదీకాకుండా ఆడపిల్లను ఒంటిగా బస్తీలో వుంచటం అన్న ఆలోచనే ఆవిడకి హడలెత్తించింది.

భర్తతో ఎన్నో విధాల చెప్పిచూచింది, కూతురుకి బోధించింది. కూతురు మారాంచేసీ, భర్త గారాము చేసీ రాజమ్మను ఒప్పించారు.

తండ్రి యిష్టప్రకారమే ఉమ చదవటానికి పట్నం వెళ్ళింది. హాస్టల్లోవుంటూ కాలేజీకి పోతూ వస్తూ వుంది......

ఉమ అందచందాలు దారి పొడుగునా చూసే వాళ్ళ మాటలకి విషయం అయ్యేవి. ఉమ గుణగణాలు చర్చలుగా సాగుతుండేవి. ఉమ మాత్రం వంచిన తల ఎత్తకుండా, తన మామూలు నవ్వులు మరో కంట పడకుండా, చిన్ని పాదాలతో రోడ్డును కొలుస్తున్నట్టు నెమ్మదిగా ఒకేదారిన నడుస్తూండేది.

ఇన్నాళ్ళకు ఒకనాడు దారి మారింది. జీవితపు దారినే మార్చివేసింది. ఆ క్రితం రాత్రి ఎందుకో ఎంతకూ నిద్రపట్టలేదు. అంతుతెలియని వుత్సాహంతో ఆమె హృదయం అంచులు నిండింది. కన్నుమూస్తే కలత నిద్ర, ఆ కలతలో కలలు...

...తండ్రి రామస్వామి మంచంమీద కూర్చొని రామాయణం పారాయణం చేస్తూ వున్నాడు రాత్రి భోజనాల తరువాత. వంట యిల్లు అంతా సద్దుకొని. "ఊ. ఈ యింటిపని యిప్పటికి తెగటారింది' అనుకొంటూ రాజమ్మ గదిలోకి వచ్చింది. అద్దంలో తల సవరించుకొని. మెల్లగా భర్త మంచం ప్రక్కన వచ్చి కూర్చుంది. ఏదో మాట్లాడటానికి. విషయమైతేవుంది, కానీ ఆరంభించడం ఎలాగో తోచటంలేదు.

అది గమనించాడు భర్త "పురాణం ప్రారంభించు. ఆగావేం?" అన్నాడు. "ఆడవాళ్ళం మాకేమి పురాణాలు వుంటాయి లెండి" అంది. లేకేం రోజూ ఒకటే పురాణం, అమ్మాయి పెండ్లి సంగతి, అదేనా? అన్నాడు.

"మీకేమండీ! తినటం తిరగటం తప్ప ఇంటి విషయాలే పట్టించుకోరు. పెళ్ళీడు వచ్చిన అమ్మాయి యింటిలో పెరుగుతున్న దన్న విషయం మీకు తెలియటం లేదు." అన్నది. "నిత్యం పడుకోబోయే ముందు నీవు జ్ఞాపకం చేస్తూ వుంటావుగా!" అన్నాడు రామస్వామి.

"ఏమండీ అమ్మాయిని ఒక అయ్యచేతిలో పెట్టితే మన బాధ్యతా, బరువూ, తీరతాయి."

ఆ మాటకు రామస్వామి. నవ్వుతూ లేతాదు లావు గుమ్మడి తీగకు ఎంతో పెద్దకాయ విచ్చాడు దేవుడు. అది మోస్తూందా లేదా? మన అమ్మాయి మనకంత బరువుగావుందా? పిచ్చిదానా! పెళ్ళి అంటే సూరేళ్ళ పంటే. బొమ్మల పెళ్ళి అనుకున్నావా ఏం? జనకు డంతటి మహారాజే సీతకు పెండ్లి చేయవలసి వచ్చేటప్పటికి, స్వయంవరం చాటించాడు," అన్నాడు.

"ఆయన మహారాజు, మనం సామాన్యులం. కొంప తీసి మీరు కూడా మొగుణ్ణి వెతుక్కొనే పని కూతురికే అప్పగిస్తారా ఏం?"...

ఉమకు ఆ కలత నిద్రలో, తన తల్లి తండ్రుల యీ సంభాషణ తటుక్కుమంది. మెలకువ వచ్చింది.. తనకు తానే నవ్వుకున్నది. ఇలాగే ఏవేవో వూహలతో ఉత్సాహంతో సరిగా నిద్ర పోలేదు, తుపాన్‌కు ముందు ప్రశాంతతలాగ, క్రొత్త ఆలోచనలు రాలేదు. రాత్రి శేషమంతా అలాగే

## "పుట్టింటికి"



చిత్రం : వై. బాలయ్య.

గడిచిపోయింది.

మర్నాడు కాలేజీకి లేటుగా బయలుదేరింది. దగ్గర దారని, మామూలు దారి కాకుండా మార్చి వెళ్ళుతూ వుంది. తల్లి అన్న చివరిమాట పదేపదే జ్ఞాపకం వస్తూ ముసిముసినవ్వులు నవ్వుకుంటూవుంది, తలవంచుకు పోతున్న ఉమ కాలికి- ఏదో టక్కున యేదో ఒక బంతి తాకటం జరిగింది. ఎదురుగా చారదేసి కళ్ళతో గగనమంతా మనసుతో రాముడే తనకోసం వచ్చాడా అన్నట్టు చూస్తూవున్న అబ్బాయి. టక్కున "ఏయ్ మిస్టర్, కళ్ళు కనబడటంలేదా!" అంది ఉమ.

అతను ఉలిక్కిపడి. పల్లెటూరిలోవున్న పిల్లలంతా పట్నాలకు చదువులకనివస్తూవుంటే, కళ్ళన్నీ వాళ్ళ మీదే వుంది, వేరే కనిపించటంలేదు" అన్నాడు అమ్మాయి చేతిలోని పుస్తకాలు గమనించి.

"యూ పటప్"అంటూ చెయ్యి పైకెత్తింది. కొట్టడానికి ఉమ. అతను ఆ చేతిని మధ్యలోనే పట్టుకున్నాడు తనమీద పడకుండా.

"ఏయ్ వదులు చెయ్యి" అంటూ తన చేతిని వెనక్కులాక్కుంది. ఉమ కాళ్ళ దగ్గరవున్న బంతి యిరువురి సంభాషణ అంతా చూస్తూ వున్నట్లు వున్నది.

"కాలుకెంత దెబ్బ తగిలిందీ"

అంటూ ముందుకు వంగింది, కాలును చూసుకోటానికి. "అయ్యో పాపం" అంటూ అతనుకూడా కాలు చూడటానికి ముందుకువంగాడు.

అనుకోకుండానే యిద్దరి తలలు ఢీ కొట్టుకున్నాయి.

ఏమండీ వేళాకోళంగావుందా?" అంది ఉమా

"సారీ మేడం మీకాలిదెబ్బ చూద్దామనుకొన్నాను నన్ను పొరపాటుగా భావించకండి నేను చాలా మంచివాణ్ని" అన్నాడు.

"మంచికి యిదే నిదర్శనమైతే లోకం మండి పోతుంది." అంటూ వెళ్ళిపోతూంది ఉమ.

"ఏమండి మీరు ఏ కాలేజీలో చదువుతున్నారు? మీ యిల్లెక్కడ? ప్లీజ్" అంటూ జవాబురాని ప్రశ్నలు చాలా వేసి ఉమ కనుమరు గయినంత వరకూ అక్కడే వుండి, వెళ్ళిపోయాడు.

ఉమకు యిది అంతా క్రొత్త అనుభవంగానే వుంది. హృదయంలో క్రొత్త తలపు కోరికలు చెలరేగుతున్నాయి. మర్నాడు మామూలు దారి కాకుండా, ఈ దారినే పడింది. అతను మళ్ళీ కన పడతాడా, అక్కడే వుంటాడా, తన కోసం కాచు కుని కూర్చుంటాడా, మగవాడు, కూర్చోవచ్చు. ఈ రోజు మాత్రం అతనికి గట్టిగా బుద్ధి చెప్పాలి' అని ఆలోచిస్తూ - అత నేమి చేయబోతాడో తా నేమి చేస్తుందో - అన్నీ తనే వూహించుకుంటూ, నిన్నటి చోటుకి వచ్చింది. తన మామూలు ధోరణిలో తల ఎత్తకుండానే అటూ యిటూ కళ్లు తిప్పి చూచింది. అతను అక్కడ లేడు.

తన వూహలన్నీ తల్లక్రిందులయి, పేకమేడ లాగ నేల కూలాయి. 'మంచిది ఏ గొడవా లేకుండా పోయింది' అనుకుంటూ గబగబా నడచిపోతూ వుంది. వెనుకనుండి అతను వస్తూ వున్నాడేమో అన్న వూహ లేకపోలేదు. అయినా ధైర్యంగానే వెళ్ళింది

ఆ రోజు ఎవరో స్నేహితుల్ని కలుసుకునేందుకు పెందరాడే వెళ్ళాలని సాయంత్రం గం॥ 5కే నుంచి బస్సుస్టాపులో నిలుచున్నది ఉమ. ఎంతకూ బస్సు రానందుకు విందిస్తూ ఏదో ఆలోచిస్తూవుంది. "మేడం!"అన్న పిలుపుకు వెనక్కుతిరిగి చూచింది, ఎవరు? తనను అల్లరి పెట్టిన అబ్బాయే!!

"నిన్న అడ్రసు అడిగానని కోపంగా వున్నట్లు వుంది. ఏమీ లేదండి నా తప్పుకు ఎపాలజీ చెప్పుదామని అడిగాను మీరు ఆ అవకాశం యివ్వారుకాదు" అన్నాడు.

ఉమకు అతని వాలకం చూస్తూవుంటే మన్ను తిన్న క్రిష్ణుడు, తల్లి యశోద దగ్గర భయపడుతూ జవాబు చెప్పినట్లు వుంది. ఉమకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు. నవ్వుకున్నది తనలోతనే.

"పోనిలేండి కనీసం థ్యాంక్స్ అయినా చెప్పుతారేమో మీ మాట వినవచ్చును అనుకున్నాను. నో యూజ్ మీ మాటలు వినాలంటే నిన్నటిలాగే జరగాలి" అన్నాడు.

ఉమ పక్కున నవ్వింది. అతనికి యింకా స్త ధైర్యం వచ్చింది. "సరేలేండి మీరూ బలేవారే! అడగటం మరిచాను. మీ పేరేమిటండీ - నన్ను మా అమ్మ "గోపీ" అని పిలుస్తుంది. పూర్తి పేరు గోపీనాథ్ అన్నాడు.

"పరవాలేదు లెండి పేరు సార్థకం చేస్తూ వున్నారు" అంది ఉమ.

"మరి మీ పేరు చెప్పలేదు" అన్నాడు గోపీ.

"నా పేరు కావాలాండీ ఉమా, చండి, గౌరీ శంకరుల కథ' అంది చిలిపిగా.

"ఉప్మా, చట్నీ, గారే సాంబారుల కధేమోనను కున్నా పర్వాలేదు, ఉప్మా అనో ఉమా అనో పిలుచుకోవచ్చు" అన్నాడు.

ఇంతలో బస్సు వస్తోంది. "అది మీ నంబరేనా! నాది కాదులెండి" అన్నాడు.

ఉమ బస్సెక్కి వెళ్ళిపోయింది.

ఉమా గోపీల పరిచయం స్నేహంగామారి. ప్రేమలో పడిపోయింది. ప్రేమలో పడిన ఉమా గోపీలు అప్పుడప్పుడూ టాక్సీల్లో పడి సినిమాలలో మునిగి బీచీలలో తేలుతూ వుండేవారు. కాలం గడచిన కొద్ది ఎప్పుడెప్పుడా అనిపిస్తూ నిత్య కృత్యంగా మారింది. అయితే గోపీ, తొందర పాటు మనిషే అయినా ఉమా తొణకనికుండ, ఆమె తొణకని తనం, ప్రేమని ప్రణయంలో పడకుండా అరికట్టింది. ఆమె నిబ్బరాన్ని అతడు గౌరవించేవాడు, అతను తన మాటకు యిస్తున్న గౌరవానికి మురిసిపోయేది. ఒకరికి హిందీ సినిమా అంటే ఒకరు యింగ్లీషు ఒకరికి, కారమంటే ఒకరికి తీపి అనీ చిలిపితగాదా లాడుకున్నా కూడా వాళ్ళ ఆకర్షణని పెంచేవే కాని తగ్గించేవి కావు.

అలా కాలం చక్రంలాగ దొర్లి పోతూపోతూ వేసవి రానే వచ్చింది. కాలేజీలకు సెలవు లిచ్చారు. పరాయి వూళ్ళ విద్యార్థులంతా కట్టుగొయ్య విడచిన లేగల్లాగ, పుట్టిళ్ళకు పరుగులు ఎత్తేయత్నంలో వున్నారు.

ఉమ బీచీలో కూర్చుని పిచ్చి గీతలు గీస్తూ సముద్రాన్ని చూస్తూ వుంది, ఆవిడ హృదయంలో కదిలే వూహలు, సముద్రంలో ఎగిరే అలలు ఒకే లాగున్నాయి. పడుతూ లేస్తూ.

వెనుకనుండి ఎవరో కళ్ళు మూయగా వులిక్కిపడింది. ముఖం నిండా చమట ముత్యాలు రాల్తూ కిలకిల నవ్వుతున్నాడు గోపి "ఎవరనుకొని ఉలిక్కి పడ్డావు? నాకు తప్ప తాకడానికి ఈ కళ్ళు ఎవరికి సొంతం?" అంటూ ప్రక్కనే చతికిల పడ్డాడు.

ఏవేవో వూహలతో మునిసిగ్గుల్తో ఉమ...

తనువంతా కళ్ళుగా ఉమను చూస్తూ గోపీ...

కాసేపు కాలం మౌనంగా గడిచింది. ఉమ తన మనసులోని మాటని చెప్పటానికి తటపటా యిస్తూ, తంటాలు పడుతూ "గోపీ' అని వూయని మొగ్గ లాగ సిగ్గుతో తల వంచుకొంది" నే నీ రాత్రి ట్రయిన్‌లో మావూరు వెళ్తున్నాను, అన్నది.

"తెలుసునే" అన్నాడుగోపీ సిగ్గు మొగ్గలు తొడుగుతున్న ఆ మాట యింకా బయటికి రాలేదని... రప్పించాలనే వుత్సాహంతో.

"మళ్ళీ రెండు నెలల దాకా రావు :"

"ఔనూ" ... అని వూరుకొన్నాడు గోపీ...

మళ్ళీ కాలం మౌనంగా పడింది.

ఆ కాలంలో తన కను కొనల్లోంచి చూచింది గోపీని. అతని కొంటెతనం అర్థం అయింది... కాలం గడవటం తప్ప లాభంలేదని "మీ అమ్మగారితో మన విషయం చెప్పేసి, పెళ్ళికి ఏర్పాటు చెయ్యాలి" అని గిరుక్కున తల అవతలికి తిప్పేసుకొంది.

"రాణిగారు తొందర పడుతున్నారు. సిగ్గు దొంతరలు కదుపుతున్నారు" అంటూ బుగ్గమీద చిటికె వేయబోయాడు.

ఉమ లేచినవ్వుకుంటూ తుర్రున పారిపోయింది. గోపి వెంట పరుగెత్తాడు. కాలంకూడా అలా అలా పరిగెత్తింది. ఆ పరుగులోనే ఉమ ఒక్కసారి ఆగి టయిము చూచుకొని "అరే గంట ఏడున్నర అయిందే...గోపీ! నేను రూముకు వెళ్లాలి. బట్టలు సర్దుకోవాలి. ఎనిమిదిన్నరకల్లా స్టేషన్‌లో వుండాలి

---

# ఇదీ నాగరికత

పదవి పెదవి కోరింది
నాగరికత ఒళ్ళు విరుచుకుంది
సంస్కృతి చలివేంద్రంలో
అశ్లీలత దాహంగా మారింది
చంద్రుడు రొమాంటిగ్గా నవ్వుతున్నాడు
ప్రకృతి చీర విప్పుకుంటుంది
చంద్రుడు పగిలిపోతున్నాడు
వెన్నెల ఒలికిపోతోంది
సన్నజాజులు విచ్చుకుంటున్నాయి
బ్రాసరీ తెగిపోతుంది సనభారానికి
విస్కీనిషాలో కేంద్రానికి
నిచ్చెన లేస్తున్నాడొక ఖద్దరుశాలి
జాకెట్టులేని ఆడాళ్ళతో కులుకుతు
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే నాటుబట్టీలోయ్
అంటున్నాడొక విప్లవనాయకుడు
కాలేజీ కుర్రాణ్ణిచూసి
ఇదై తేనేకాని కిట్టదంటుంది
చెట్టునీడలో నిలబడ్డ అభిసారిక
ఊహలతో రమిస్తున్నాడొక పిల్లకాపి
కిరాయిలేని మానసిక వ్యభిచారానికి
మురిసిపోతున్నాడొక రోమియో
పార్కులో పసిగుడ్డే డుస్తుంది
ప్రేమకు పర్యవసానంగా
కాల్వలో తేలిం దొక
దగాపడిన జీవితం
ప్రగతికి ప్రతిరూపంగ
చంద్రుడు సిగ్గుతో పల్చబడ్డాడు
పక్షులు పారిపోతున్నాయి
క్రొత్తప్రపంచాలను వెతుక్కుంటూ
నిజంతెలిసిన సూర్యుడు నవ్వుతున్నాడు!!

— లక్ష్మి

నీవూ తప్పకుండా రావాలి" అంటూ ఆజ్ఞాపించినట్లుగా చెప్పేసి సమాధానానికి ఆగకుండా వెళ్ళిపోయింది.

రైల్వే స్టేషన్‌కు గోపీ ముందుగానే వచ్చాడు. ఉమ రాగానే...చిరునవ్వులు చిందిస్తూ ఒక చాక్లేట్ డబ్బా అందించాడు"...ఎందుకో తెలుసా? ఈ తీపి తింటూ రాత్రిఅంతా నన్ను తలచుకొని తీయ తీయని కలలు కనటానికి" ఓహో!....ఈ దొరగారివి, తలవకుంటే కాలం గడవదా యేం." యిలా ఛలోక్తులతోనే బండి టయిమయింది. గంట మ్రోగింది. స్టేషన్‌మాస్టరు పచ్చజెండా చూపుతున్నాడు.

"గోపీ వెళ్ళి వస్తాను...మీ అమ్మగారితో మాట్లాడి ఉత్తరం రాయాలి"

"ఉత్తరమా, నేనో, వచ్చేస్తాం. సరిగ్గా పదిహేనోనాడు...పెళ్ళికొడుకుముందు పెళ్ళిచూపులకు రావాలిగా" తథాస్తుఅన్నట్లుగా గార్డు విజిల్, మూడో గంట, రైలుకూత, వినిపించాయి. బండి జర్రిపోతులాగా పోవటం మొదలు పెట్టింది...

ప్లాట్‌ఫారంమీద గోపీ, బండిలో ఉమా, ఒకరికొకరు దూరమవుతున్నారు. కానీ వారి హృదయాలు రెండూ 'వివాహం'అనే ఒకే ఆలోచన చుట్టు తిరుగుతున్నాయి.

ఉమ యింటికిరావటమే తండ్రి, తల్లి, అన్నా కొండత ఆనందించారు. తల్లి ఆరోగ్యంగురించి, తండ్రి చదువును గురించి, అన్న పట్నంలో సినిమాలు విశేషాలూ గురించీ. గుక్క తిప్పుకోకుండా ప్రశ్నల వర్షం కురిపించారు...

గోపీ... తన పెళ్ళి విషయం తల్లితో ఎలా కదిలించటమా! అని సమయం కోసం వేచి వున్నాడు.

గోపీ తల్లి మునెమ్మగార్కి ఈ మధ్య కొడుకు ప్రవర్తన మీద కొంచము అనుమానం కలిగింది. యింట్లో నుండి పెందరాళే బయటికి వెళుతూ, ఆలస్యంగా యింటికి చేరటం, తిండీ నిద్రా కూడా వేళ తప్పటం ఎప్పుడడిగినా స్నేహితులతో సినిమాకు వెళ్ళినాననో, ఏవో కబుర్లు అడుతున్నాననో అనటం. స్నేహితులు ఆడవా? మగవా? అని అనుమానంవచ్చేది. అయినా బయటకి అనేది కాదు. తనకు తెలిసిన అప్పలక్కలు ఒక రిద్దరు గోపీని ఒక అమ్మాయితో చూశామని అన్నారుగానీ నమ్మ బుద్ధి కాలేదు. వాళ్ళు పసికాయ మీద అబద్ధాలు చెపుతున్నారు అని బుకాయించింది.

ఎందు కయినా మంచిదని. ఒకటి రెండుసార్లు చదువు: ప్రవర్తన వగైరాలమీద చిన్నచిన్నలెక్చర్లిచ్చింది. తండ్రిలేని బిడ్డలను యెన్ని ఆశలతో పెంచుకుంటారో వివరించింది.

ఇప్పుడు కాలేజీ సెలవులతర్వాత గోపీ ఎప్పుడూ ఇంటిపట్టునే వుండటంతో తన బోధలు కొడుకు మీద పనిచేశాయి అనుకొన్నది. కుర్రతనంతోఅలా యిలా తిరిగినా తన మాటకు అడుగు దాటలేదని తృప్తిపడింది.

"ఉమకు యిలాంటి గొడవలేలేవు." ప్రేమ, పెళ్ళివిషయాలుకూడా తనవారికి ధైర్యంగా చెప్పగలదు. తల్లి కాస్త నసిగినా తండ్రి, అన్న తన మాటను బలపరుస్తారన్న ధైర్యంవుంది. కానీ విషయాన్ని చెప్పెయ్యాలనికూడా ఎన్నోసార్లు అనుకుంది...కానీ గోపీనుండి ఉత్తరం రావాలిగదా... ఆ ఉత్తరంకోసం రేపోమాపో అని ఎదురుచూస్తున్నది. ఉత్తరం రాయకుండానే గోపీయే వూడిపడతాడేమో? అంతటి కొంటివాడుకూడా...

ఒకనాడు తల్లి వంటపనిలో వుండగా వంట ఇంటిలోవున్న కుర్చీలో వచ్చి కూర్చున్నాడు గోపి. ఎప్పుడూరాని కొడుకు వంటఇంటిలోకి రావటం కుర్చీలో కూర్చుండిపోవటం చూసి, ఆశ్చర్యపోయింది తల్లి.

"అమ్మా చాలా రోజులనుండి నీకు ఒకమాట చెప్పాలనివుంది" అన్నాడు తడబడుతూ.

"ఏమిటి? అలాంటి మాట అయితే మరి యిన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదురా"అంది మునెమ్మ.

"ఏమీ లేదమ్మా. మా కాలేజీలో నా క్లాస్‌మేట్ ఒక అమ్మాయి వుంది. చాలా అందంగా వుంటుందమ్మా...ఆ అమ్మాయీ నేనూ ప్రేమించుకొన్నాం. పెళ్ళికూడా చేసుకోవాలని అనుకున్నాము. అందుకు నీ ఆశీర్వాదాలు కావాలి." అన్నాడు గోపి.

ఈ మాటతో మునెమ్మ నవనాడులూ ఒక్కసారి తెగినట్లు క్షణంపాటు కొయ్యబారిపోయింది.

ఎప్పుడో ఒకప్పుడు యిలాంటిది వినవలసి వస్తుందని అనుమానం వుండనే వుంది. ఇప్పుడు అదే జరిగింది. అయినా కాస్త నిగ్రహించుకొని - "ఆ పిల్ల కులమేమిట్రా!" అంది.

"తెలియదు." యిన్నాళ్లుగా ఆ విషయం వాళ్ళ ఆలోచనకే రాలేదు. అవసరమూ కనిపించలేదు.

"ఏమిట్రా నువ్వనేది? ఆ పిల్ల కులమూ, గోత్రమూ తెలియదు? వాళ్ళు ఎక్కడో, మనము ఎక్కడో, మన అంతస్తుకు తగిన వాళ్ళేనా? నీకు మతివుందా లేదా? కాలేజీ చదువుతో వెలగబెట్టింది యిదన్న మాట! ఎంత ధైర్యంరా నీకు, ప్రేమ, పెళ్ళి అని నా దగ్గరే చెప్పటానికి వచ్చావు!"అంది తల్లి రుద్రకంఠంతో.

గోపి హృదయంలో వేయి అగ్నిపర్వతాలు ఒక్కసారిగా ప్రేలినట్లు అనిపించింది. రూములోకి వెళ్ళి శిలాప్రతిమలాగ కూర్చున్నాడు.

ఉమతో తాను వాళ్ళ వూరు వస్తానన్న రోజు దగ్గరకు వస్తూ వుంది. మనసులో ఆరాటం త్రాచులాగ బుసలు కొడుతుంది. ఎలాగయినా ఈ రోజు ధైర్యంచేసి తల్లిని మళ్ళీ అడగాలని అనుకున్నాడు.

మధ్యాహ్నం ఎండ తీవ్రంగా కాస్తూ వుంది.

మునెమ్మగారు టేబుల్ ఫేన్ వేసుకొని రామాయణం చదువుతావుంది. పక్క వాకిట్లో నుంచి వచ్చి నిలబడ్డాడు గోపీ. అది చూసి "ఏం బాబూ" అంది......

"నా పెళ్ళి విషయం అమ్మా" అన్నాడు గోపీ.

బాబూ, మీ నాన్న పోయినతర్వాత. అన్ని ఆశలు నీ మీదనే పెట్టుకొని చిన్నప్పటి నుండి నిన్ను ఎంత బాగా సాకానో, ఎట్లా సాకానో నీకు తెలుసు. అంటూ కన్నీళ్ళు ఏకధారగా కార్చింది. నేను నీ కండ్లముందు వుండాలంటే, ఆ పెండ్లి మాట తలపెట్టవు అంతే" అంది చివరకు...

ఆ మాటతో యింకా యేమీమాట్లాడకుండా వచ్చేసాడు గోపీ...వుదయం నిద్రలేచిన గోపికి ఎదురుగా గోడకు వున్న క్యాలెండరు కర్తవ్యాన్ని జ్ఞాపకం చేసింది. "ఉమ" దగ్గరికి వెళ్ళాలి అని.

ఒక ప్రక్క తల్లి చెప్పిన చివరి మాటలు తలలో గిర్రు మంటూ వున్నాయి. విధి తనని చూసి వికటంగా విరగబడి నవ్వుతుంది. అటు తల్లి ఇటు ఉమ, ఈ రెండు ప్రేమలూ తనని ఎడా పెడా చెంపలు వాయిస్తున్నట్లుంది. గాలిలో దీపంలాగ గిజగిజలాడి పోతున్నాడు. 'తల్లి' 'ఉమ' యిద్దరి ప్రేమకునోచుకోలేదు. ఏదోఒకటిత్యాగంచెయ్యాలి ఆ ఒకటి ఏదో తోచటంలేదు. తన స్వార్థాని



క్రాసుగా చేసి చూస్తే ఏ ఒక్కరూ తగ్గుగానీ. మొగ్గ గానీ, కనిపించటం లేదు. పిచ్చి పట్టినట్లు వూరంతా తిరిగాడు. ఇల్లు పట్టడమే లేదు. మరునాడూ అంతే"

కొడుకు యింక తనకు దక్కడన్న అనుమానం వేసింది మునెమ్మకు. ఆ మాట తలచుకొంటే విల విలలాడి పోతుంది ప్రాణం.......

ఇంతలో గోపి వచ్చాడు...అతని ఆకారం చూస్తుంటే గుండె చెరువయ్యింది...అందులోనే కొడుకు వచ్చాడన్న సంతోషం ఆశ. ఏమయినా తన బిడ్డ తనను కాదని ఏపనీ చేయడని నమ్మకం. ఏదో కుర్రతనంలో కొంత గొడవపడినా చివరకి తన దారికే వస్తాడన్న గట్టి విశ్వాసం ఏర్పడింది. గోపి మళ్ళీ ఆ విషయం ఎత్తితే యింకా కాస్త గట్టిగా బుద్ధి చెప్పాలని కూడా వుంది. తానై పలకరిస్తే చులకనవుతానేమో అని కొడుకును పలకరించను కూడా లేదు...గోపి ఈ రెండు రోజులుగా ఎక్కడెక్కడ తిరిగాడో...ఏమి ఏమి ఆలోచించాడో తెలియదు. ఇంటికి రావడమే తిన్నగా తన గది లోకి వెళ్ళినాడు. గదిలో ఎదురుగా తండ్రి పటం కనిపిస్తూవుంది. ప్రక్కగా శ్రీరామచంద్రమూర్తి, సీతాలక్ష్మణులతో వనవాసానికి వెళ్లుతున్న పటం వుంది. ఇంతలో గదిగుమ్మంలో తల్లి కనిపించింది.

"తల్లి, తండ్రి, గురువు. దైవం" అన్నారు. లోక రక్షకుడయిన రాముడు స్వంత తల్లి కాదు సవతి తల్లి మాటకోసం పద్నాలుగు ఏండ్లు అరణ్య వాసం అనుభవించినాడు. "మరి తాను ?" యివి గోపి తలలో సినిమా రీళ్ళలాగ తిరగసాగాయి. వెంటనే పెన్ను పేపరు తీసుకొని, గబగబా వ్రాసి పోస్టుచేసి యింటిదారి పట్టాడు......

తాను నడుస్తున్న రోడ్డు ఒక్కొక్క అడుగే వెనక్కు జరుగుతుంది. వెనక జరిగిన విషయాలు ఒక్కొక్కటీ తనముందు కనిపిస్తూ వున్నాయి యిదే దారి యిక్కడే మొదటిసారి కలుసుకున్నాం. రెండోసారి అక్కడ. యిలా గత జ్ఞాపకాలు తనను చుట్టుముట్టేశాయి. ఆ జ్ఞాపకాలు తప్ప అతనికి ఏదీ వినిపించదు కనిపించదు...

వెనుకనుండి హారను మ్రోగింది. సడన్‌గా కారు ఆగింది. కారులోనుండి ఒక చక్కని అమ్మాయి, తల బయటికి పెట్టింది. నల్ల అద్దాల జోడు తీస్తూ - "ఏయ్ మిష్టర్ తెల్లవారి యింటిలో చెప్పి వచ్చావా? యిలా నడిరోడ్డులో నడుస్తున్నావు" అంటూ కారు స్టార్ట్ చేసుకొని తుర్రున వెళ్ళింది.

ఆ అమ్మాయి అందముగా ఉందో లేదో. ఆ అద్దాలు తెల్లవో. నల్లవో. దూషించిందో. భూషించిందో...ఏదీ తెలిసే స్థితిలో లేడు. తను నడుస్తూ వస్తున్న తారు రోడ్డు నీరు లేని ఎడారిలా కనిపిస్తావుంది అతనికి......

ఆ రోజు ఉమ అయిదు గంటలకే నిద్రలేచింది. తెల్లవారే సరికల్లా తలస్నానం చేసి, తెల్ల చీర కట్టుకొని అప్పుడే విచ్చిన మల్లె మొగ్గ లాగ వుంది...

తల్లి రాజమ్మ కూతురి వాలకం చూచి "ఏమండీ ఈ వేళ గాలివాన వస్తుంది" అంది భర్తతో "అదేమిటే శకున పక్షి" అన్నాడు రామస్వామి. పుట్టి బుద్ధి ఎరిగిన తరువాత ప్రొద్దు మొహం చూడని సింగారాల కూతురు, ఈ వాళ ప్రొద్దు పొడిచే టప్పటికి స్నానం కూడా చేసి సింగారించుకొని కూర్చుంది". "సరేలే వెళ్ళి నీపని చూచుకో అమ్మాయిని ఆడిపోసు కోటం తప్ప వేరే పని లేదు" అని కసిరాడు రామస్వామి, పాడుగూరు ప్రయాణం తొందరలో వుంది.

ఆ రోజే గోపి గడువు పెట్టిన ఆఖరి రోజు. ఇంతవరకు ఏ వుత్తరం రాలేదు, కనుక తప్పక తానే వస్తాడు అన్న ఆనందంలో వుంది ఉమ. ఏ కాస్త చప్పుడయినా గుమ్మం దగ్గరికి వచ్చి చూస్తుంది. గంటలు గడుస్తున్నాయి. తనలో ఆరాటం ఎక్కువ అవుతుంది. గదిలోనుండి పెరట్లో వున్న జాజిపందిరి దగ్గరికి వెళ్ళి నిల్చున్నది. తను గోపి కోసం నిరీక్షిస్తున్నట్లే ...జాజి మొగ్గలుకూడా సాయంత్రం కోసం నిరీక్షిస్తూ వున్నట్లున్నాయి. పుష్పం. ఆడది ఒకటే. తన అందాన్ని ఆనందాన్ని మరి ఒకరికి పంచితే గాని ఆ జీవితాలకు సార్థకత వుండదు అనిపించింది. ఆ ఆలోచనకు తనలో తానే నవ్వుకొంది ... ఎవరో వస్తున్నట్లు చప్పుడయింది..గోపి వస్తున్నాడు అనుకొన్నది- గుమ్మం దగ్గరికి పరిగెత్తింది. కాని పోస్టుమేన్ వుత్తరం అందించాడు. తిప్పి చూచింది. అడ్రసు గోపి రాసిందే. అతను రావటంలేదన్నమాట. ఒక క్షణం నిరాశపడింది. అంతలో వుత్తర మయినా వచ్చిందన్న ఆనందంతో గబగబా గదిలోకి పరుగెత్తింది, తలుపులు మూసి మంచంమీద పడుకొని కవరు చించింది. ఉత్తరం మొదటిలోనే "స్నేహితురాలు" అని వుండటం చూచి నీరుగారిపోయింది. అయినా గుండెదడుపుతోనే ఉత్తరం పూర్తిగా చదివింది. ఉమకు గాలిఆడకుండా, నెలయేర్లుపారకుండా ప్రకృతి అంతా నిశ్శబ్దంగావున్నట్లుయింది. 'శిలనై పోదునో కలనై పోదునో సగమై ఆగిన కథనై పోదునో' కంటికి ధారగా కరిగిపోదునో అని కళవళపడింది.

..మధ్యాహ్నం అయినా కూడా కూతురు ఎక్కడా కనిపించకపోయేసరికి - "ప్రొద్దున్నే లేచింది గా మళ్ళీ నిద్రకుపడింది గా మోలు" అనుకుంటూ రాజమ్మ పడకగదిలోకి చూచింది. "ఉమా, అమ్మా ఉమా !! అంటూ లోపలికి వెళ్ళింది. కుర్చీలో కూర్చొని ఏదో ఆలోచిస్తున్న కూతురుని చూచి.

"భోజనానికి లేమ్మా" అంది తల్లి.

"నాకు ఆకలిగా లేదమ్మా" అంది కూతురు.

"ఉదయంకూడా టిఫిన్ సరిగా చేయలేదు, ఆకలిగా లేదంటా వేమిటే" అందితల్లి.

"అమ్మా నాకు తలనొప్పిగావుంది నన్ను విసిగించకు" అంది.

తల్లి అక్కడనుండి వెళ్ళిపోయింది.- ఉమకు ఉత్తరంతో కలిగిన ఆవేదన కాస్త తగ్గుముఖం పట్టి. మెదడు ఆలోచించటం మొదలుపెట్టింది... తామిద్దరి పరిచయంలో, స్నేహంలో, ప్రేమలో ఈ కులమూ గోత్రమూ ఒకనాడు స్ఫురణకు రాలేదు. ప్రణయానికి సంతాన ప్రాప్తికి కూడా యివి అడ్డు వచ్చేవికావు.

ఇవన్నీ ప్రకృతి సహజాలు. సృష్టి నైజాలు. కులము, అంతస్తు అన్నవి. ఏదో పిల్లలను జడిపించటానికి చెప్పే. బూచిలాగా వుంది. ఆ బూచీ యిప్పుడు మా జీవితాలకు పెట్టని అడ్డుగోడై నిలిచింది...

తనతండ్రి కూడా యిలాగే వద్దనేవాడా అనడు. అన్నా, గోపీగనుక వివాహానికి అంగీకరించి వుంటే తాను ఆడదయినా తనకున్న అన్ని బంధాలు తెంచుకొని మరీ వెళ్ళిపోయి వుండేది, గోపి మగవాడు. అయినా సాహసించ లేడు. తాను వెలుగు వేడగా దేవుడు చీకటి ప్రసాదించాడు. పాలు తోడు బెట్టి పెరుగు చేయగానే సరిపోదు. దానిలో వెన్న తీయటం తెలుసుకోవాలి ... తమకు తెలియదు. వంచుట తెలిసిన నా మనసునకు. మరచుట అంతసులభం అనిపించటం లేదు.

ఇంట్లో తన ప్రేమ విషయం చెప్పలేదు. మంచిదయింది. చెప్పివుంటే. ఈ స్థితిలో తండ్రి ప్రాణాలే విడచి వుండేవాడు...

అనుకొంటూ సొమ్మసిల్లి నిద్రపోయింది.

రాజమ్మకు, ఉదయమంతా కూతురుహుషారుగా ఉండటంగానీ యిప్పుడిలా విసుగు చెందటంగానీ ఏదీ బోధపడ లేదు.

ప్రొద్దుట ఉత్సాహం చూచి కూతురికి త్వరలో పెళ్ళిచేయాలనుకుంది. ఇప్పుడూ అదే అనుకొంటూవున్నది. భర్త వూరినుండి రాగానే అమ్మాయి పెండ్లి విషయం అటోయిటో తేల్చేయాలని అనుకుంది,

రామస్వామి వూరినుండి వస్తూనే గుమ్మంలోనుండి "రాజీ" నీ కొక శుభవార్త అంటూ "వచ్చాడు."

"ఏమిటండీ అలా కేకలు పెడుతున్నారు. అంది ఉప్మాకు రవ్వ కొలుస్తున్న రాజమ్మ.

"నీకొక శుభవార్తే."

"ఏముంటుందీ, కూతురు పాసై వుంటుంది. పట్నం మళ్ళీ పై చదువుకు పంపిస్తారు. అంతే గాని దాని పెళ్ళి విషయం కాదుగదా" ...అంటూ ఎదురువచ్చింది ఆశగా.

"శుభవార్తేనే మన అమ్మాయి పెండ్లివిషయం. నాకు చిన్నప్పుడు ఒక స్నేహితుడు వుండేవాడు. వాడూ నేనూ ఒక బళ్ళోనే చదువుకునే వాళ్ళం. వాడికి ఒకేఒక కొడుకు. ఈ మధ్యనే విదేశాలకు కూడా వెళ్ళివచ్చాడు. అబ్బాయి పేరు పురుషోత్తం" అంటూ యింక పూర్తిగా చెప్పనేలేదు.

"ఏమో, దాని అదృష్టం ఎలావుంటే అలా జరుగుతుంది. కానీండి వెంటనే ముహూర్తం పెట్టించండి" అంది రాజమ్మ.

"అమ్మాయి యిష్టం కూడా తెలుసుకోనీయ్" అన్నాడు రామస్వామి.

"ఆ అయితే యింకా పెళ్ళి అయినట్లే - అది చదువుకుంటాను నాన్నా అంటుంది. మీరు సరే నమ్మా అంటారు...యిక అంతటితోసరి."

"ఆఁ ఏమే ... పెళ్ళి చేసుకొనేది అమ్మాయి. తాను యిష్టపడకుండా ఎలా ?" అన్నాడు రామస్వామి.

"మీ దాదస్తమేగానీ, మీ యిష్టాన్ని కాదంటుందా నా తల్లి ... అది ఎంత చదువుకున్నా నా కూతురే ... మీరు నిర్ణయించుకొచ్చానని చెప్పెయ్యండి, తర్వాత నేను మాట్లాడుతాను" అంది.

"అలాగే కాస్త స్వరాన్ని కట్టేయ్ చెపుతా" అంటూ గదిలోకి పోయాడు రామస్వామి.

రెండురోజులు ఆగి, మధ్యాహ్నం భోజనాలయ్యాక గదిలో ఏదో పుస్తకం చదువుతున్న ఉమని "అమ్మా ఉమా యిలా రామ్మా" అని పిలిచాడు తండ్రి.

"వస్తున్నా నాన్నా" అంటూ చదువుతున్న పుస్తకం టేబులుమీద వుంచి తండ్రి దగ్గరికి వచ్చింది ఉమ.

'కొంచెం దాహం పట్రా అమ్మా" అన్నాడు తండ్రి ..

దాహం తెచ్చి యిచ్చింది.

దాహం తీసుకొన్నతరువాత "యిలాకూర్చోమ్మా నీతో కొంచెము మాట్లాడాలి" అన్నాడు తండ్రి.

"అలాగే నాన్న" అంటూ దగ్గరవున్న కుర్చీలాక్కొని కూర్చుంది.

"ఏమీ లేదమ్మ నా స్నేహితుని కొడుకు డాక్టరు వున్నాడు. అతనిని మూడు రోజులక్రితం కలసి మాట్లాడాను. రెండు రోజులలో పెండ్లి విషయాలు మాట్లాడాలి. నీ యిష్టం ఏమిటమ్మా ?" అడిగాడు.

చితికిన మనసు చేతిలో పెట్టుకొనివున్న ఉమ ఏమని సమాధానం చెప్పగలదు ?

"నన్ను ఎందుకు నాన్న అడగటం" అని వూరుకుంది.

"చదువుకున్నదానివి బుద్ధిలో మాకంటే తెలిసినదానివి. పైగా యిది నీ పెళ్ళి. నిన్ను అడక్కుండా ఎలాగమ్మా" అన్నాడు. రామస్వామి తలనిమురుతూ.

ఉమ నోరు విప్పలేదు. వంచిన తల ఎత్తలేదు.

"ఏ అభిప్రాయం వేరే వుంటే చెప్పమ్మా" అని జవాబుకోసం ఆగాడు...ఏమీ లేకపోయేసరికి

"ఏమ్మా నీ మనసులో ఎవరన్నా వున్నారా ?" అని గుచ్చినట్లు అడిగాడు.

ఈ మాటకి ఉమ ఉలిక్కిపడింది ... నేలనే చూస్తున్న కంటిలోనుండి ఓ నీటిబొట్టు చేతిమీద రాలింది.

చప్పున ఆ చెయ్యి దాచుకుంది. తండ్రి యిది ఏది గమనించలేదు.

'చెప్పమ్మా...కావంటే వాళ్ళకు వద్దని కబురు చేస్తాను" అన్నాడు...

"అయ్యో యింత మంచి నాన్నకుకూడా తన ప్రేమవిషయం దాచవలసి వచ్చిందే" అని గుండె చెరువు చేసుకుంది.

"మీ మాటకు యేరోజూ ఎదురు చెప్పలేదు మీ యిష్టం" అంది.

తండ్రి సంతోషంతో నాకు తెలుసమ్మా, నా యిష్టమే నీ యిష్టమనీ. అందుకే నేను అన్నిమాటాడాను." అంటూవున్న తండ్రిమాటలు వినిపించుకోకుండా పెరట్లోకి వెళ్ళిపోయింది. గుబులు గుబులుగా వున్న గుండెతో పెరటంతా తిరగసాగింది.

పెళ్ళికి ముహూర్తం నిశ్చయమయ్యింది. ఒకరోజు ఉమ తండ్రి దగ్గరకువచ్చి "నాన్నా నేను ఒకసారి పట్నం వెళ్ళవస్తాను" అంది.

'ఎందుకు ? యేమి అని అడగకుండానే తండ్రి "వెళ్ళిరామ్మా. స్నేహితులకు ఎవరికన్నా పెళ్ళికబుర్లు చెప్పాలంటే చెప్పిరా.." అన్నాడు.

ఉమ పట్నం వచ్చింది.

గోపీ తానూ కలుసుకున్ననాటినుంచి నేటివరకూ తిరిగిన చోట్లన్నీ కలయతిరిగింది.

ఒకనాడు తాను ఆడుకున్న పాప్కా ఈ రోజు ఎండిన మోడులావుంది. పూచి నవనవలాడే పువ్వులు వాడి నేల రాలినట్లున్నాయి నిత్యం తన కలయికను కలకలలాడే బీచి నిర్జీవంగావుంది. సంతోషంతో తన పాదాలను ముద్దాడటానికా అన్నట్లు, ఒడ్డుకు పరుగెత్తే అలలు, ఈ నాడుతనని మ్రింగటానికి పైబడుతున్నట్లున్నాయి... ఉమ అక్కడనుండి దడదడలాడేగుండెతో వెళ్ళిపోయింది. "ఎలాగూ వచ్చాను గనుక ఒకసారి గోపిని కలుసుకుంటే మాట్లాడితే' అనిపించి గోపీవుండే చోట్లలా తిరిగింది. కానీ అతను లేడు. తిరిగి వూరికి వెళ్ళాలనుకొంది. కాని గోపీని గురించిన యీ ఆశలు కాళ్ళకు బంధాలై సాగనివ్వటంలేదు.

చివరకు తెగించి, మొండిధైర్యంతో టెలిఫోన్ బూతులోకి జొరబడి ... గోపీ యింటికే ఫోన్ చేసింది. యిది ఆఖరి ప్రయత్నం. చివరి ఆశ...

"గోపీ వున్నారా" అన్న తన పిలుపుకు జవాబుగా...ఆడగొంతు వినిపించింది.

"ఎవరు" ఉమ కళవళ పడింది ... అయినా "నేను, నేనూ" అని చెప్పబోయింది. అవతలనుండి ఆ ఆడగొంతు రుద్ర కంఠమయింది. "ఎవరయితేనేం, ఆడపిల్లవు సిగ్గులేదూ - మరీ యింత బరితెగిస్తే ఎట్లా! అంటూ చీవాటు పెట్టింది. ఉమకు యింకేమి వినిపించలేదు. కళ్ళు తిరుగుతున్నట్లయి ప్రక్కకు ఒరుగుతూ ఫోన్ పెట్టేసింది.

మెల్లగా బయటకివచ్చి, టాక్సీపిలచి కూర్చున్నది. తాని నగరాన్ని, జ్ఞాపకాలనీ, అన్నిటినీ శాశ్వతంగా వదిలేసి పోవాలి. పోతుంది .. అప్పటికి, తన జీవితాన్నిలాగే ఆ నగరాన్ని, చీకటి ఆలుము కొంది, అయితే వీధిలైట్లు ఆ నగరాన్ని వెలిగిస్తాయి. కాని తనను తానే వెలిగించుకోవాలి.

మౌంట్‌రోడ్డుగుండా టాక్సీ సాగుతూ పోతూవుంది. ఒకప్పుడీ వీధిలైట్లు తనమీద వెలుగునీడలు చల్లాయి. యిప్పుడూ అలాగే చేస్తున్నాయి. అయితే ఆ నాడు యిద్దరు. ఈ నాడు తానొకత్తె.

టాక్సీముందుకు పోతుంటే, వీధి లైట్లన్నీ అంత స్పీడులోనూ వెనక్కి పోతున్నాయి.

తన గత జ్ఞాపకాల్లాగే సెంట్రల్ స్టేషన్లో దిగి రైలు ఎక్కింది.

గోపీ తానూ చివరిసారిగా కలుసుకున్నది యిక్కడే. విడిపోవటంకూడా యిక్కడే ఆసారి...

ఆ చిట్టచివరి సంఘటననికూడా ప్లాట్‌ఫారం మీదనే వదిలివేస్తూ రైలు వెళ్ళిపోయింది.

ఉమ పెండ్లింట్లో అన్న మూర్తి హడావిడిగా వున్నాడు. ఎండిళ్ళ వేసేవాళ్ళు, గాడిపొయ్యి త్రవ్వేవాళ్ళు- ఇల్లు అలికేవాళ్ళు, ముగ్గులు పెట్టేవాళ్ళు నిన్నుయిూ వచ్చు, సంబారాలు సమకూర్చేవాళ్ల యిరుగు పొరుగుజనమంతా ఇల్లునిండివుంటే, రాజమ్మ, రామస్వామి, పెళ్లి ఆనందములోపాటు అవీ యివీ కాలేదని కీచులాడుకుంటూ రాట్నంలా గిరిగిరా తిరుగసాగారు.

ఉమమాత్రం తనకుకాదు యీ పెండ్లి, తన శరీరానికి అనుకుంది. మనసు సరిపెట్టుకోలేక మదన పడిపోయింది. శిలపై రాలిన పువ్వులా తన పెండ్లి అలంకారాలు, తలంబ్రాలు అన్నీ...అలాగే పెండ్లి కూతురు అయింది,

నుదుట బాసికం, కాళ్ళకు పారాణి, పట్టుచీరలో అపర లక్ష్మీదేవిలాగ వుంది చూచేవాళ్ళకు, కనుల పండుగగా వుంది ఉమ ..

"అరి వేణుపూజకు అమ్మాయిని తీసుకరండి. ముహూర్తం మించిపోతుంది" అన్నాడు పురోహితుడు.

అమ్మలక్కలువెళ్ళి ఉమను తీసుకొస్తూవున్నారు.

ఉమ మెల్లగా నడుస్తున్నది తాను కాదన్నట్లు. మేడమెట్లు దిగుతూ వుంది.

ఒక రైతు పెండ్లి పందిట్లోకి పరుగెత్తుతుంటూ వచ్చి "మూర్తి బాబూ' మూర్తిబాబూ మన వీధి చివరన ఎవరో ఒక కుర్రవాడు స్పృహలేకుండా పడివున్నాడు. అతని చేతిమీద గోపీ అని పచ్చ కూడా వుందట. అన్నాడు.

ఈ మాటలు మెట్లు దిగుతున్న ఉమ చెవిలో పడ్డాయి, వెంటనే "గోపీ" అంటూ వీధిలోకి పరుగుతీసింది. ఒక్కపరుగులో గోపీ దగ్గర చేరి "వచ్చావా గోపీ నన్ను చూడటానికి వచ్చావా ? చూడు నేను ఎంత అందంగా వున్నానో" అంది. గోపీ కళ్ళు తెరచి "ఉమా" అన్నాడు. అంతే.

ఉమ "గోపీ" అంది.

ఆ యిద్దరి కలలు ఒకే కౌగిట్లో కరిగిపోయాయి. ఒడ్డును అధిగమించాల అని ఎగిరిపడే సముద్రపు అలలు, ఒడ్డును ఢీకొని, తిరిగి పడినట్లే, ఈ అవ్యవస్థ తాకిడికి ఆ లేతప్రాణాలు ఒరిగిపోయాయి..

యిద్దరి హృదయాల్లోని జ్యోతులూ ఆరిపోయాయి. నేలలో నీరు యింకినట్లు అక్కడచేరిన జనమంతా "ప్రేమకు ప్రతిరూపులు, ఆకాశంలో వెలిగే తారలు" అని దీవించారు,

P. S. లైలామజ్నూలు, దేవదాసులకి ముందు కాలంనుంచీ కులమూ, ఆస్తీ, అంతస్తులూ, ఏర్పడినప్పట్నించీ జరుగుతున్న కథే యిది.

ఎన్ని ప్రాణాలు తీసినా తృప్తితీరని యీ వర్గ వ్యవస్థ వున్నంతకాలం జరుగుతుండే కథే యిది.

★